నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 01 ఆగస్టు 2023

గ్రంథాలయ చైర్మన్ పదవీకాలం పొడగింపు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆరుట్ల రాజేశ్వర్ పదవీకాలం మరో రెండేండ్లు పొడగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని ఎల్ఎంబి రాజేశ్వర్ సెక్రటేరియట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు సీఎం కేసీఆర్ నమ్మకానికి తగ్గట్టుగా పనిచేయాలని మంత్రి సూచించారు.

ఈసెట్ ధృవపత్రాల పరిశీలన


సర్టిఫికేట్‌లు వెరిఫై చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంజనీరింగ్ కళాశాలలో లాటరల్ ఎంట్రీ ఈసెట్ - 2023 లో భాగంగా అన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకున్న 340 మంది విద్యార్థులు సోమవారం (జులై 31న) ధృవపత్రాల పరిశీలనకు హాజరయ్యారని నిజామాబాద్ సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్ సమన్వయకర్త సి.శ్రీరామ్ కూమార్ తెలిపారు. ధృవపత్రాల పరిశీలన ఆగస్టు 2 వరకు కొనసాగుతుందని, ధృవపత్రాల పరిశీలన పూర్తి అయిన విద్యార్థులు ఈనెల 4 వరకు కళాశాలల ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని సూచించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ https://tsecet.nic.inలో సంప్రదించాలని అన్నారు.

మాకో టీచర్ కావాలి సారు

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన చిన్నారి విద్యార్థులు
- తల్లిదండ్రులతో కలిసి డీఈవోకు వినతి



స్కూల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ

నవతెలంగాణ-లింగంపేట్

తమ బడికి పంతులను పంపండి సారు అంటూ చిన్నారి విద్యార్థులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఒక్కరే విధులు చేపడుతుంటంతో తాము వెనకబడుతున్నామని, ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. లింగంపేట్ మండలంలోని భవానిపేట్ గ్రామంలో హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాల చెందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు, విద్యాకమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలకు తాళం వేసి నిరసన చేపట్టి అనంతరం అనంతరం కామారెడ్డి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 76 మంది విద్యార్థులకు గాను ప్రస్తుతం ఒక్క టీచర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఒక్కరే ఉండటంతో విద్యాబోధనలో వెనుకబడుతున్నామని పలుమార్లు ఎంఈవోకు సూచించినా పట్టించుకోవడంలేదని వాపోయారు. గత ఐదేండ్లుగా ఒక్కరే ఇక్కడ పని చేస్తున్నట్టు తెలిపారు. దీంతో విద్యార్థుల సంఖ్య 120 ఉండేదని, ప్రస్తుతం నుంచి 76 మందికి చేరిందని, మరో ఉపాధ్యాయుడిని నియమించకపోతే విద్యార్థుల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉందని అన్నారు. వెంటనే ఇద్దరు టీచర్ల నియమించాలని డిమాండ్ చేశారు. త్వరలో మరో ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేస్తామని డీఈవో హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ పోచయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు జీవన్ లక్ష్మణ్, సాయగౌడ్, అజీ పాషా, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.


డీఈవోకు వినతిపత్రం అందజేత


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన గ్రామపంచాయతీ కార్మికులు

కదం తొక్కిన జీపీ కార్మికులు

- కలెక్టరేట్ ముట్టడి.. బైటాయింపు
- పెద్దఎత్తున తరలివచ్చిన పారిశుధ్య కార్మికులు
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

గ్రామపంచాయతీ కార్మికులు కదం తొక్కారు. తమ సమస్యలు పరిష్కారం చేసి తమ డిమాండ్‌లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ 26 రోజులుగా సమ్మె చేపట్టినప్పటికీ పాలకులు స్పందించకపోవడంతో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన కార్మికులు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఖానాపూర్ బైపాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రెండు గంటల పాటు బైటాయించి నినాదాలు చేశారు. కార్మికుల ధర్నాతో కలెక్టరేట్ ఎదుట ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి.

ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. కార్మికులకు జీవో నెంబర్ 60ను అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని, కారోబార్లకు బిల్ కలెక్టర్లకు ప్రమోషన్స్ సౌకర్యాన్ని అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికులకు దహన సంస్కారాల కోసం రూ..50 వేలు చెల్లించడంతో పాటు రూ.10 లక్షల గ్రాట్యూటీని ఇవ్వాలని వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీ కార్మికుల సేవలను పొగుడుతూనే సన్మానాలు చేస్తూ మెచ్చుకుంటున్నారే తప్ప.. వారి సమస్యలను మాత్రం పరిష్కరించక పోవడం ప్రభుత్వాల ద్వంద్వనీతిని అద్దం పడుతుందని అన్నారు. ప్రభుత్వ విధానాల్లో మార్పు రాకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అందుకు జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం జేఏసీ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందచేసి మాట్లాడారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఏ రమేష్ బాబు, జంగం గంగాధర్, నన్నే సాబ్, ఐఎఫ్‌టియు నాయకులు జేపీ గంగాధర్, శివకుమార్, ఖాజా మొయినుద్దీన్, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు వెంకటి, బి మల్లేష్ రమేష్, పంచాయితీ జిల్లా నాయకులు సాగర్, మీన్ కుమార్, రంజిత్ గౌడ్ నవీన్, తదితరులతోపాటు పెద్ద ఎత్తున ఆయా మండలాల కార్మికులు కారో బార్లు, ఎలక్ట్రీషన్లు అటెండర్లు ,బిల్ కలెక్టర్ లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

69 వినతులు, ఫిర్యాదులు

- ప్రజావాణి వినతులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, ఫిర్యాదులకు సంబంధిత అధికారులు స్పందించి, సత్వర పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. సోమవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 69 ఫిర్యాదులు అందినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందని అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలించి, అట్టి దరఖాస్తులకు సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గం చూపాలని ఆదేశించారు.


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి మూసివేత

- నిండుకుండను తలపిస్తున్న జలాశయం
- ఇప్పటి వరకు 37 టీఎంసీల నీరు దిగువకు విడుదల


నిండుకుండలా ఎస్సారెస్పీ

కాలువకు నీటి విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఇన్‌ఫ్లో 52 వేల క్యూసెక్కులకు పెరగడంతో 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లను మూసివేశారు. క్రమంగా ఇన్‌ఫ్లో తగ్గుతూ రాత్రి 7 గంటల సమయంలో 8400 కూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. లక్ష్మి కాలువకు 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు(90.3 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1089.90 అడుగుల (84.291 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు తెలిపారు. గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్టులో నీటిమట్టం 1087.60 అడుగుల (75.146 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. దీంతో ఎస్సారె-స్పీ నిండుకుండను తలపిస్తుంది.

ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి నేటి వరకు ఎస్సారెస్పీకి 100.9 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అందులో రివర్స్ పంపింగ్ ద్వారా 2.53 టీఎంసీల నీరు ప్రాజెక్టులకు వచ్చినట్టు అధికారులు తెలిపారు. గేట్లు ఎత్తి దిగువకు 37.155 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు.

కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసిన ఎంపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఢిల్లీలో సోమవారం ఎంపీ ధర్మపురి అరవింద్ కలిశారు. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో పలు పనుల్లో అవకతవకలు జరిగాయని, విచారణ చేపట్టాలని కోరినట్టు ఎంపీ తెలిపారు. 'స్కీం ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కాపిటల్ ఎక్స్ పెండిచర్, ఇన్వెస్ట్మెంట్' ద్వారా నిర్మితమైన పలు ప్రాజెక్టులకు డబుల్ బిల్లింగ్ సృష్టించి, కేంద్ర నిధులు స్వాహా చేసిన విషయాన్ని ఆర్థిక మంత్రికి వివరించానని తెలిపారు. ఈ స్కీం లో రూ.5221 కోట్లా రూపాయలు కేంద్రం తెలంగాణకు అందించిన వాటిపై విచారణ జరిపించాలని కోరినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విషయమై విచారణ జరిపి, దోషులు అని తేలితే కఠిన చర్యలుంటాయని తెలిపారు.


కేంద్రమంత్రితో మాట్లాడుతున్న ఎంపీ

పంటనష్టంపై పట్టింపేది..?

- ఇప్పటి వరకు పరిశీలించని అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్, డోంగ్లి ఇరు మండలాల పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీటితో నష్టపోయిన పంటలకు పరిహారంపై అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. వరద తాకిడికి పంట నష్టపోయినా అధికారులు వచ్చి కనీసం పరిశీలించిన దాఖలాలే లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మద్నూర్ మండలంలోని గోజేగావ్, సోనాల, తడిహిప్పర్గా గ్రామ శివారు లెండి వాగు వరద నీటి ప్రవాహంతో పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. డోంగ్లి మండల పరిధిలోని లింబూర్, డోంగ్లి, చిన్న టాక్లి, పెద్ద టాక్లి, సిర్పూర్, మదన్ హిప్పర్గ, ఇల్లేగావ్, ఎనబరా, కుర్ల తదితర గ్రామాల్లో పంటలు భారీగా నష్టపోయాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు వరద నీటితో నష్టపోయిన పంటలకు ప్రభుత్వము పంట నష్ట సర్వేలు చేయించాలని నష్టపోయిన రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇరు మండలాల పరిధిలో భారీగా నష్టపోయిన పంటలకు అధికారులు వెంటనే సర్వేలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు అందించి నష్టపరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని వ్యవసాయ రైతులు కోరుతున్నారు.


డోంగ్లి శివారులో నీటమునిగిన పంట

ఓటర్‌ఐడీలో అడ్రస్, పోలింగ్ కేంద్రాల


మార్పులు, చేర్పులకు అవకాశం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. శాసనసభా నియోజకవర్గాల వారీగా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వేరే ప్రాంతానికి తరలించాల్సిన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, ఓటర్ల సంఖ్య ఆధారంగా ఒకే పోలింగ్ స్టేషన్ లో విలీనం అయ్యే పోలింగ్ కేంద్రాల వివరాలతో కూడిన ప్రతిపాదనలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షుణ్ణంగా చర్చించారు. పురాతన కాలం నాటి, శిథిలావస్థకు చేరిన భవనాలలో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాలను వేరేచోటికి మార్చడం, 1400 పైచిలుకు ఓటర్లు కలిగిన పోలింగ్ స్టేషన్ల పరిధిలో కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు, అలాగే కొత్తగా ఏర్పడిన కాలనీల పరిధిలో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు, రెండు కిలోమీటర్లు అంతకంటే ఎక్కువ దూరంలో పోలింగ్ స్టేషన్లు ఉన్న ప్రాంతాలను గుర్తిస్తూ కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 1509 పోలింగ్ కేంద్రాలు కొనసాగుతుండగా, కొత్తగా మరో 40 కేంద్రాలను ప్రతిపాదించామని, దీనితో జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1549కి పెరుగుతుందని వివరించారు. కొత్తగా ఏర్పడిన మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలతో పాటు మరికొన్ని పోలింగ్ స్టేషన్ల పేర్లలో మార్పులు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడినందున ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. ఈ ప్రతిపాదనలను ఆమోదం నిమిత్తం ఆగస్టు 4 వ తేదీ లోపు ఎన్నికల సంఘానికి పంపనున్నామని తెలిపారు. మార్పులు, చేర్పులు జరిగిన పోలింగ్ కేంద్రాల గురించి ఓటర్లకు తెలిసేలా క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన పలు అంశాలపై కలెక్టర్ వారికి అవగాహన కల్పిస్తూ, సందేహాలను నివృత్తి చేశారు. ఒక ప్రాంతంలోని ఓటర్లకు స్థానిక పోలింగ్ స్టేషన్లో ఓటు హక్కు ఉండేలా చూస్తామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఫొటో సిమిలర్ ఎంట్రీ విధానం ద్వారా ఓటరు జాబితాలో దాదాపు 99 శాతం వరకు డూప్లికేషన్ ఓట్లు తొలగించబడ్డాయని, ఇంకనూ ఎక్కడైనా డూప్లికేషన్ ఉన్నట్లు గుర్తిస్తే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, నియోజకవర్గ కేంద్రాల తహసీల్దార్లు, వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పవన్, సాత్విక్, సంతోష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

బీజేపీలో భగ్గుమన్న విబేధాలు

- వ్యక్తిపూజ చేసే వారికే పదవులిస్తున్నారని సీనియర్ల మండిపాటు
- పార్టీ జిల్లా కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ నాయకులు



ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీజేపీలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఎంపీ అరవింద్, పార్టీ జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీనర్సయ్య ఒంటెద్దుపోకడలకు పాల్పడుతున్నారని, పార్టీ కోసం పని చేసే వారికంటే.. వ్యక్తిగత పూజ చేసే నాయకులకే పదవులు కట్టబెడుతున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయాన్ని ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు సోమవారం ముట్టడించారు. ప్లకార్డులు చేతబట్టి వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత లేకుండా పోయిందని, పార్టీ కోసం పని చేస్తున్న వారికి కాకుండా, వ్యక్తులకు జై అంటునన వారికే పదవులు ఇస్తున్నారని ఎంపీ తీరుపై మండిపడ్డారు.

వివరాలు మెయిన్‌లో..

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్మికుడు మృతి



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌కు చెందిన చిట్యాల రాజేష్ (29) కరీంనగర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపల్ కార్యాలయంలో గత కొన్ని సంవత్సరాల నుండి పారిశుద్ధ కార్మికునిగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్ మూడు రోజుల క్రితం అత్తగారి ఇంటిలో ఉన్న అతని భార్య పిల్లలను తీసుకు వచ్చేందుకు వెళ్తుండగా కరీంనగర్‌లో రోడ్డు ప్రమాదానికి గురైయ్యారు. తీవ్ర గాయాలు కావడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు.


మున్సిపల్‌లో మౌనం పాటించి నివాళి

మౌనం పాటించి నివాళి

కార్మికుడు రాజేశ్ మృతి చెందడంతో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. మున్సిపల్ సాధారణ సమావేశంలో చైర్పర్సన్ పండిత్ వినీత పవన్, వైస్ చైర్మన్ షేక్ మున్నా, కమిషనర్ ప్రసాద్ చౌహన్, అధికారులు, కౌన్సిలర్లు ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

వర్షాలకు దెబ్బతిన్న కాలనీల్లో పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కాలనీల్లో సమస్యలను సోమవారం సర్పంచ్ సక్కారం అశోక్ సందర్శించి పరిశీలించారు. భారీ వర్షాల మూలంగా దెబ్బతిన్న ఇండ్లను కోతకు గురైన రోడ్లను పరిశీలించి కాలనీవాసులతో మాట్లాడారు. గ్రామంలోని పితుర్ కుంట దగ్గర వరద ప్రవాహానికి నష్టం జరిగిన పలు ఇండ్లను పరిశీలించారు. కోతకు గురైన పీతుర్ కుంట నుండి మోర్తాడు మండలం దొన్పల్ వెళ్లే దారిని పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ఇండ్లలోకి నీరు వస్తుందని కాలనీవాసులు ఆయన దష్టికి తీసుకువచ్చారు. గ్రామ పంచాయతీ నిధుల నుండి త్వరలోనే మురికి కాలువలను వెడల్పు చేస్తామని కాలనీవాసులకు హామీనిచ్చారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌కు చెందిన చిట్యాల రాజేష్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తాడు. మూడు రోజుల కిందట చిట్యాల రాజేష్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాకేష్ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు 10వేల ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు ఫౌండేషన్ తరుపున సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లి కన్వీనర్ పాలెపు రాజు, సురేష్ రెడ్డి, బూమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ కమిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కేజీబీవీ, మోడల్ స్కూల్లలో డిఇవో అనుమతి లేకుండా విద్యార్థి సంఘాలను, మీడియాను లోపలికి రావడానికి అనుమతి లేదని విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు లవిశెట్టి ప్రసాద్ , కె శ్రీశైలం సోమవారం తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 49 రోజులు గడుస్తున్న యూనిఫామ్‌లు ఇవ్వలేదని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో పుస్తకాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. సమస్యలు తెలుసుకుని పోరాడే వారిపై ఆంక్షలు విధించడం సమంజసం కాదన్నారు. స్వయాన సీఎం మనువడే ప్రభుత్వ పాఠశాలలో పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారని అన్నారు. కెజిబివిలను, కళాశాలను అప్ గ్రేడ్ చేసిన భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు- మన బడి పథకం కింద ఎంపిక చేసిన, ఆ నిధులు కాంట్రాక్టర్లకు అందాయి తప్ప, ఏ ఒక్క విద్యార్థికి మేలు చేసింది లేదన్నారు. తక్షణమే దేవా సేన ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సహాయ కార్యదర్శి వెంకటేష్ ఉపాధ్యక్షులు సంధ్యారెడ్డి కమిటీ సభ్యులు , నవీన్ , చిత్ర, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

టీయూ న్యాయ శాస్త్ర విభాగాధిపతిగా డాక్టర్ కె. ప్రసన్న రాణి నియామకం



తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ ఐఏఎస్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్. ఎం.యాదగిరి న్యాయ శాస్త్ర విభాగాధిపతిగా డాక్టర్ కె ప్రసన్న రాణికి నియామక ఉత్తర్వులను సోమవారం అందజేశారు. తెలంగాణ యూనివర్సిటీలోని న్యాయ శాస్త్ర విభాగం అభివృద్ధిలో భాగం పంచుకుంటామని ఆమె తెలిపారు. వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్లకు కతజ్ఞతలు తెలిపారు. న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్రవంతి ప్రసన్న రాణిని అభినందించారు.

పరీక్షల ఫిజుకు 3చివరి తేదీ

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బిఈడి 4వ సెమిస్టర్ రెగ్యులర్ మరియు 1,2, 3,4వ సెమిస్టర్ (2019, 2020, 2021, 2022 బ్యాచ్)బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లించడానికి ఆగస్టు 3 వరకు గడవు ఉందని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వరకు 100 రూపాయల అపరాధ రుసుంతో ఫీజు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్ www. telanganauniversity.ac.inని సంప్రదించాలని సూచించారు.

చెట్టును ఢీ కొట్టిన ఆటో

- 10మందికి గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఆటో చెట్టును ఢీకొట్టడంతో పదిమందికి గాయాలైన ఘటన మండలంలోని సికింద్రాపూర్ జాతీయ రహదారి 44 పైన చోటుచేసుకుంది. ఆర్మూర్ నుండి జక్రాన్ పల్లి మండలంలోని కేసుపల్లి గ్రామానికి అంత్యక్రియలకు వెళుండగా సికింద్రాపూర్ గ్రామం వద్ద ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న పదిమందికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ఎంజే హాస్పిటల్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

పాఠ్యపుస్తకాలు అందజేత

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను మున్సిపల్ ఛైర్మన్ కన్నె ప్రేమలత సురేందర్ సోమవారం అందజేశారు. మంచి మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సపాల్ చిరంజీవి, కౌన్సిలర్లు సతీష్‌గౌడ్, నర్సయ్య, అధ్యాపకులు కృష్ణదాస్, శ్రీనివాస్, రామచంద్రన్ తదితరులున్నారు.

పాముకాటు బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని బీనోల గ్రామంలో పాముకాటుతో చనిపోయిన రెండేళ్ల బాలుడి కుటుంబాన్ని బీజేపీ నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తండ్రి మంగలి భూమేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ప్రమాద ఘటన జరగడం శోచనీయమని భవిష్యత్తులో కుటుంబానికి భరోసాగా ఉంటామని ధైర్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయక పోవడం వల్లనే ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణ సాయంగా 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సరిన్, మువ్వ నాగేశ్వర్ రావు, ఛైర్మన్ శైలేష్ కుమార్, గంగాధర్ రాము, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-భీంగల్

మండల సమగ్ర శిక్ష అభియాన్ నూతన కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి డప్పు దిలీప్ అధ్యక్షతన సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు బాలరాజు (సీఆర్‌పి పల్లికొండ), అధ్యక్షులు నరేష్ (సిసిఓ యంఆర్‌సి), ప్రధాన కార్యదర్శి పురస్తు సువర్ణ (పీఈటి కస్తూర్బ కెజిబివి), ఉపాధ్యక్షులు జలంధర్ (ఐఈఆర్‌పి), కోశాధికారి విజయలక్ష్మి (సిఆర్‌టి కెజీబివి), సహాయకార్యదర్శి రవిబాబు (యంఐఎస్ సివో), సంయుక్త కార్యదర్శి మాదివి పిజీసిఆర్‌టి, సౌజన్య హెడ్‌కుక్) కార్యవర్గ సభ్యులు కిషన్ (ఐఈఆర్‌పి, పిజీసిఆర్‌టి)ను ఎన్నుకున్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

టీయూలో క్రీడాసౌకర్యాలు మెరుగు పరచాలి

- తరుణ్ ఏఐఎస్ఎఫ్ ఇంచార్జ్, తెలంగాణ యూనివర్సిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్. నేత కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తరుస్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారని, వారు రన్నింగ్‌తో పాటు ఇతర క్రీడల్లో నైపుణ్యం పొందాల్సిన అవసరం వుందని తెలిపారు. క్రీడా మైదానంలో మెరుగైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అన్ని రకాల క్రీడల మెటీరియల్స్‌ని అందుబాటులో వుంచాలని కోరారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

మండలంలో ఆదివారం ఉదయం నుండి సోమవారం ఉదయం వరకు 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోద యింది. మండలంలోని ఉప్లూర్‌లో ఆదివారం అర్ధరాత్రి బలమైన ఈదురుగాలతో కూడిన వర్షానికి గ్రామానికి చెందిన మాసం సత్యనారాయణ పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయింది. వర్షాల మూలంగా ఇల్లు మొత్తం ఉరుస్తుండడంతో మాసం సత్యనారాయణ కుటుంబ సభ్యులు వేరేచోట నివాసం ఉంటున్నారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయ్యింది. సోమవారం కూలిపోయిన ఇంటిని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేందర్ పరిశీలించారు. ఈవిషయాన్ని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

కధన బేరి కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-నవీపేట్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో కదన బేరి కరపత్రాలను సోమ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు, స్కాలర్షిప్‌లు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని అన్నారు. ఆగస్టు ఒకటిన హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్ లో జరిగే కదనభేరిలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ బాగ్ కో కన్వీనర్ ప్రణయ్, భాను గౌడ్, బిట్టు, వెంకట్, గుణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణవాయువు చాలా విలువైనదని

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



రానున్న రోజుల్లో ప్రాణవాయువు చాలా విలువైనదని అని విఆర్ఈసి ఛైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో హరిత హారం కార్యక్రమాన్ని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ శంకర్ హెమరాం, బ్రాంచ్ మేనేజర్ పుష్ప రెడ్డిలతో కలిసి విఆర్ఈసి ఛైర్మన్ నరేందర్ రెడ్డి మొక్కలు నాటారు. మొక్కలను నాటి భావితరాలకు పచ్చని ప్రకతి ని అందిద్దామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్, వైస్ ప్రిన్సిపాల్ సబ్బురత్నం, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ స్వప్న ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

- ఎంపీపీ కుంచాల విమలరాజు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/భీంగల్

మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో గేదజాతి, గోజాతి పశువులలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ఎంపీపీ కుంచాల విమల రాజు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, సర్పంచ్ గంగామణి గంగాధర్, మండల కో ఆప్షన్ మేంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, మండల డాక్టర్ శిరీష, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భీంగల్:మండలంలోని ఛేంగల్ గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలను వేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి ఆర్మూర్ మహేష్, సర్పంచ్ చిన్నారెడ్డి హాజరై 49 ఆవులు, 242 గేదెలకు టీకాలను వేశారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కృష్ణ, సిబ్బంది మూడపల్లి సుమన్, సంతోష్ మరియు రైతులు ఉన్నారు.



భీంగల్ : టీకాల కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపీపీ

వరదనష్టంపై ఎప్పుడు సమీక్ష నిర్వహిస్తారు?

- మంత్రి, ఎమ్మెల్యేలను ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎప్పుడు వరద నష్టంపై సమీక్ష నిర్వహించి బాధితులను ఆదుకుంటారని జిల్లా మంత్రి ఎమ్మెల్యేలను నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ భవన్‌లో నగర అధ్యక్షులు కేశ వేణుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అధిక ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిందని, అయినా జిల్లా మంత్రి ప్రశాంత్ రెడ్డి గాని, ఎమ్మెల్యేలు గానీ నష్టపోయిన పంట పొలాల వద్దకు గాని, ఇల్లు కూలిపోయిన వారి దగ్గరికి గాని వెళ్లి పరామర్శించలేదని అన్నారు. వర్షాలు తగ్గినప్పుడు తూతూ మంత్రంగా పర్యటించి ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్య పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రతి నియోజకవర్గంలో తిరుగుతూ నష్టాన్ని అంచనా వేస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ అర్బన్‌లో వర్షాల కారణంగా చాలా ప్రాంతాలు నీటిమయమయ్యాయని అన్నారు. బాల్కొండ నియోజకవర్గం, నిజామబాద్ రూరల్ లో గాని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రి కమిషన్లకు కక్కుర్తిపడి కట్టిన చెక్ డ్యాములు నాణ్యత లోపంతో నిర్మించడంవల్ల వర్షాలకు కూలిపోయి పొలాల్లో ఇసుక మేటలు వేశాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి నష్టాలకు ఇన్‌ఫుట్ సబ్సిడీ ద్వారా ఆర్థిక సహాయం వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం వరదలతో ప్రజలు నష్టపోయినా ఆర్థిక సహాయం అందించింది లేదని అన్నారు. నిజమాబాద్ ఎంపీ అరవింద్ జిల్లాలో వరదలతో ప్రజలు నష్టపోతుంటే హైదరాబాద్‌లో తన వ్యాపారాలు చూసుకుంటున్నాడని విమర్శించారు. నష్టాన్ని అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపి నష్టపరిహారం అందించే విధంగా చూడాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వేణు రాజ్, అఖిల్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా సేవదల్ అధ్యక్షులు సంతోష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన రైతు రెంజర్ల మహేందర్ మొక్కజొన్న తోటలో ఆదివారం అర్ధరాత్రి అడవి పందులు దాడి చేశాయి. అడవి పందుల దాడిలో సుమారు అర ఎకరం వరకు పంటకు నష్టం వాటిల్లింది. రైతు మహేందర్ మూడు ఎకరాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలో అడవి పందులు అక్కడక్కడ మొక్కజొన్న కర్రలను తొలగించాయి. అర ఎకరం వరకు పంటకు నష్టం వాటిల్లినట్టు రైతు వాపోయాడు. పసుపు కర్రలను కూడా చాలాచోట్ల అడవి పందులు తవ్వేసినట్లు తెలిపాడు. అడవి పందుల దాడి నుండి పంటలను కాపాడేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాకె

చలో కలెక్టర్‌రేట్‌కు తరలిన జీపీ కార్మికులు, కారోబార్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కషి చేయాలని, పలు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే విధంగా చూడాలని కోరుతూ రాష్ట్ర జెఎసి పిలుపులో భాగంగా చలో కలెక్టరేట్ ముట్టడికి డిచ్ పల్లి, ఇందల్ వాయి మండలాల నుండి గ్రామ పంచాయతీ కార్మికులు, కారోబర్లు నిజామాబాద్ సోమవారం వాహనాల్లో తరలి వెళ్లారు. అంతకు ముందు పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు వాసరి సాయినాథ్, ఇందల్ వాయి మండల సిఐటియు అధ్యక్షులు మ్యాదరి గంగారాం మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య మొండి వైఖరి విడనాడి వెంటనే జేఏసీతో చర్చలు జరిపాలని అన్నారు. 11వ పీఆర్సీ, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనం ఇవ్వాలని, జీవో నెంబర్ 51ను సవరించాలని అన్నారు. కార్మికులందరికీ ప్రమాద భీమా10 లక్షలు, సాధారణ బీమా 5లక్షలు పోస్ట్ ఆఫీస్ లో కట్టాలని పిఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతి, జెపి గంగాధర్,శ్యాంసన్, సాయిలు, గంగారాం, మల్లయ్య,రవి, బాబన్న, అబ్బాయ్య, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-సిరికొండ



ఎస్ఐని సన్మానిస్తున్న నాయకులు

ఇటీవలే నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జి.రమేష్ ను సోమవారం బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. న్యాయ సంరక్షణలో పారదర్శకంగా ఉండాలని, తమవంతు సహకారాలు ఎల్లవేళలా వుంటాయని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, రంజిత్ రెడ్డి, రామస్వామి, బాబురావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో గురుకుల అభ్యర్థులకు ఇబ్బందులు

- వందల కిలోమీటర్లు వెళ్లి పరీక్షలు ఎలా రాస్తారు?
- టిపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో గురుకుల అభ్యర్థులకు ఇబ్బందులు తప్పడం లేదని టిపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో డిగ్రీ, జూనియర్ లెక్చరర్ల టీజీటీ, ఫిజికల్ డైరెక్టర్ తదితర 9 రకాల ఉద్యోగాలు నిర్వహించే ఆన్లైన్ పరీక్షలకు అభ్యర్థులు ఒక్కో ఎగ్జామ్ ఒక్కొక్క జిల్లాకు సెంటర్లను కేటాయించడంపై కెసిఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆనాలోచిత నిర్ణయంగా కాంగ్రెస్ పార్టీ భావిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి నిబంధనలతో అభ్యర్థులు వందలాది కిలోమీటర్లు వెళ్లి పరీక్షలు ఎలా రాస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యూపీఎస్సీ కూడ ఇలాంటి నిబంధనలు పాటించలేదని, అభ్యర్థి కోరిక మేరకే జిల్లాలోని ఎగ్జామ్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కానీ కేసీఆర్ పాలనలో గురుకుల అభ్యర్థులు మూడు పేపర్లు ఎగ్జామ్ రాయడానికి ఒక్కొక్క జిల్లాలో సెంటర్లు పడ్డాయని తెలిపారు. దీంతో అభ్యర్థులు వందల కిలోమీటర్లు తిరిగే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అభ్యర్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని, గురుకులాల రిక్రూమెంట్ కోసం రెండు లక్షల 66వేలమంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం తీసుకున్న నిబంధనాలతో అభ్యర్థుల పరిస్థితి ఆగం అయ్యిందన్నారు. తక్షణమే గురుకుల అభ్యర్థులు కోరుకున్న సెంటర్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకుల విమర్శలు సరికాదు

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లిలో భారీ వర్షాల మూలంగా నష్టపోయిన పంటలను పరిశీలించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి మంత్రి ప్రశాంత్ రెడ్డి పై విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చౌట్‌పల్లిలో భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువును పరిశీలించిన మోహన్ రెడ్డి పనులు సరిగా చేయలేకపోవడం మూలంగానే నష్టం జరిగిందని అనడం, మూడు సంవత్సరాలుగా రైతులు నష్టపోతున్నారని మాట్లాడడం ఎంతవరకు సమంజసమో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు ఏ కాంగ్రెస్ నాయకుడు ప్రజల్లోకి వచ్చిన పాపాన పోలేదన్నారు. భారీ వర్షాలను సైతం లెక్కచేయకుండా మంత్రి ప్రశాంతి రెడ్డి గ్రామాల్లో తిరుగుతూ ప్రజాప్రతినిధులను, అధికారులను అప్రమత్తం చేసి నష్టం జరగకుండా చూశారన్నారు. భారీ వర్షాల మూలంగా వచ్చిన వరదలతో జరిగిన నష్టాన్ని అంచనా వేయమని ఇప్పటికే మంత్రి అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులకు తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్యాంపు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉచిత ఫిజియోథెరపీ క్యాంపు సోమవారం నిర్వహించారు. మండల కేంద్రంలో గల విద్యా వనరుల ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగుల మానసిక శారీరకం గల విద్యార్థులకు కండరాలు, నడుము, వెన్నుపూస, కాళ్లు, చేతులు సమస్యలు గల విద్యార్థులకు డాక్టర్ రేణుక ఫిజియోథెరపిస్టు ద్వారా తల్లిదండ్రులతో ఫిజియో థెరపి చేయించారు. ఇంటిదగ్గర చేసుకునే విధంగా సూచనలను సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ టీచర్లు స్వామి పద్మజ రజిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామానికి చెందిన పల్లికొండ సంధ్య కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. సంధ్య అనే వివాహితురాలు మతిస్థిమితం సరిగా లేక నిప్పంటిచుకొని ఆత్మహత్య చేసుకోగా విషయం తెలుసుకున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి తక్షణ ఆర్థిక సహాయం కింద అంత్యక్రియల కోసం 5వేల రూపాయలను పంపించారు. నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పూర్ణానందం, సర్పంచ్ భానుప్రసాద్, నాయకులు అంజిరెడ్డి, బోనగిరి రమేష్, నవీన్, రాకేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భగా నిజామాబాద్ జిల్లా వినియోగ దారుల సమాచార కేంద్రం ఛైర్మన్ మాయా వార్ రాజేశ్వర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు

ఎంపీ, మల్లికార్జున్‌రెడ్డి మళ్లీ దొరికిపోయారు

- నిధుల మంజూరులో అబద్ధపు ప్రచారాలు
- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కేంద్రం నుండి తీసుకురాని నిధులు వేమే తీసుకొచ్చామంటూ అబద్ధపు ప్రచారాలు చేసుకుంటూ ఎంపీ అరవింద్, మల్లికార్జున్ రెడ్డి మళ్ళీ దొరికిపోయారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చౌట్ పల్లి, జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం రంగారావుపేట్ గ్రామాల మధ్య సింగిల్ లైన్ బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారని తెలిపారు. సెప్టెంబర్ 19, 2022న రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి ప్రశాంత్ రెడ్డి చౌట్ పల్లి- రంగారావుపేట్ రోడ్డుకు 7.45 కోట్లతో మంజూరు చేశారని, దాని జీవో ప్రతిని ప్రదర్శించారు. చౌట్‌పల్లి- రంగారావుపేట్ డబుల్ రోడ్డుకు నిధులను ఎంపీ అరవింద్ తీసుకొచ్చాడంటూ మల్లికార్జున్ రెడ్డి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. అబద్ధపు ప్రచారానికి బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇచ్చిన సమాధానంతో దిమ్మతిరిగిందన్నారు. ఎంపీ అరవింద్‌కి కేంద్ర మంత్రి స్పెషల్ ఫైనాన్షియల్ అసిస్టెంట్ లోన్ వివరాలను తెలియజేస్తూ రాసిన ఒక లేఖను చూపిస్తూ వారు తామే నిధులు మంజూరు తీసుకొచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బిజెపి వాళ్ల సోషల్ మీడియాలో చూయిస్తున్న లేఖలోనే స్పష్టంగా అర్థమవుతుందన్నారు. స్పెషల్ ఫైనాన్స్ అసిస్టెంట్ ఫండ్ కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్టుగానే తెలంగాణా రాష్ట్రానికి లోన్ ఇచ్చిందే తప్ప గ్రాంట్ కాదన్నారు. అది కేవలం లేఖ మాత్రమే, జీవో కాపీ కాదని స్పష్టం చేశారు. లోన్‌ను తిరిగి రాష్ట్రం మళ్ళీ కేంద్రానికి చెల్లిస్తుందన్నారు. ఏప్రిల్‌లో స్పెషల్ ఫైనాన్స్ అసిస్టెంట్ నిధులు లోన్ రూపంలో కేంద్రం ఇస్తే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి తమ విచక్షణ అధికారంతో రాష్ట్రంలో వివిధ పనులకు కేటాయించారని తెలిపారు. ఆ కోవలోనే రూ. 7.45 కోట్లతో గతంలోనే మంజూరు ఇచ్చిన చౌట్ పల్లి- రంగారావుపేటరోడ్‌కు ఈ నిధుల నుండి 6 కోట్ల రుపాయలు మంత్రి కేటాయించారన్నారు. ఎంపీ అరవింద్, బిజెపి నాయకులు లోన్ రూపంలో వచ్చిన నిధులను పనులు మంజూరు చేసినట్టుగా అబద్ధపు ప్రచారాలు చేసుకుంటున్నారని విమర్శించారు. రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయండి అని కేంద్రానికి ప్రపోజల్ పెట్టి ఉంటే ఆ జీవో కాపీ చూయించండని అన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు మారు శంకర్, గడ్డం స్వామి, పెండే ప్రభాకర్, గుగులోతు భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, చౌట్ పల్లి సింగిల్ విండో ఛైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేగుంట దేవేందర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్

నవతెలంగాణ-కోటగిరి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ అన్నారు. సోమవారం పోతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కీటక జనిత వ్యాధుల నివారణపై ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం కల్పించాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై కూలిన చెట్టు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లారెడ్డి మండలంలోని జంగమయపల్లి గ్రామంలో సోమవారం ఉదయం చింత చెట్టు పడిపోయింది. గ్రామానికి చెందిన బోధనం భద్రయ్య పెంకుటిల్లుపై చింత చెట్టు పడిపోవడంతో ఇంటి పైకప్పు దెబ్బతింది. కాగా ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.


కూలిన చెట్టు.. ధ్వంసమైన ఇల్లు

పశువులకు టీకాలు తప్పనిసరి

- పాడిరైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సింహారావు
- పలు గ్రామాల్లో టీకాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సింహారావు తెలిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎల్లారెడ్డి : మండలంలోని అడివిలింగాల్ గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సింహారావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి రాకుండా ప్రతి పాడి రైతు తమ పశువులకు టీకా వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి జెడ్పీటీసీ ఉషాగౌడ్, ఎంపీపీ మాదవి బాలరాజుగౌడ్, స్థానిక ఎంపీటీసీ పార్వతి నరగౌడ్, సర్పంచ్ సువర్ణ ప్రతాపరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డా.సుభాష్, డా.సంజీవ్, డా.రవికుమార్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, మహిబూబ్, సాయిరెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డి : పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా అధికారి


రాజంపేట్ మండల కేంద్రంలో..

లింగంపేట్ : పశువులు రోగాల బారిన పడకుండా జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 50 వేల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్టు జిల్లా పశు వైద్యాధికారి సింహరావు అన్నారు. మండల కేంద్రంలో గాలికుంటు నివారణ టీకాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. కామారెడ్డి ఏడీ డాక్టర్ సంజయ్ కుమార్, ఎల్లారెడ్డి ఏడీ డాక్టర్ సుభాష్, ఎంపీపీ గరీబునిసా నయీమ్, సర్పంచ్ బొల్లు లావణ్య మండల పశువైద్యాధికారి డాక్టర్ రవి కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఎంపీటీసీ శమేమునిస పత్తిద్దీన్, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండల కేంద్రలలో గాలికుంటు నివారణ టీకాలను విండో చైర్మెన్ శివానంద్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు నీలుపటేల్, కాంగ్రెస్ నాయకుడు దాదారావ్ పటేల్, మండల పశువైద్యాధికారి పండరి తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండలంలోని కన్కల్ గ్రామంలో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ పులగం సాయిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశు వైద్య అధికారి డా.రాంచందర్, ఉప సర్పంచ్ మర్రి సాయిరెడ్డి, డెయిరీ చైర్మన్ కిష్టారెడ్డి, డా.రాంచందర్, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలో గాలికుంటు నివారణ టీకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ బండి వార్ విజయ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బస్సీ పటేల్, సర్పంచ్ దారస్‌వార్ సూర్య కాంత్, మాజీ సొసైటీ చైర్మన్లు పాకాల వార్ విజయ్, పండిత్‌రావు పటేల్, (చిన్న)శకర్గ సర్పంచ్ గఫర్, గోజేగావ్ సర్పంచ్ కుటుంబ సభ్యులు ఇర్వంత్ దేశ్ముఖ్, సతెల్లి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలోని పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండల ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్ నాయక్, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ సాయికుమార్, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, ఉప సర్పంచ్ కొమ్ములు రమేష్, పశు వైద్యాధికారి రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ : మండల కేంద్రంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలను మండల పశువైద్య అధికారి డాక్టర్ అనిల్‌రెడ్డి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ప్రతి పశువుకు ఈ టీకాలు వేయనున్నట్టు ఆయన తెలిపారు. సుమారు గ్రామంలో 200ల పశువులకు టీకాలు వేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షులు జూకంటి మోహన్‌రెడ్డి, కోఆప్షన్‌మెంబరు హైమద్ అలీ, ఉపసర్పంచ్ శివ, వార్డ్ మెంబర్ పిట్ల స్వామి, సిబ్బంది సత్య లింగం, హాజీ రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్‌లో..


జుక్కల్‌లో..

మణిపూర్ తరహాలో తెలంగాణలో అల్లర్లకు బీజేపీ కుట్ర

- తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్


మాట్లాడుతున్న ప్రకాష్‌నాయక్

నవతెలంగాణ-గాంధారి

మణిపూర్ తరహాలో తెలంగాణలో అల్లర్ల చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తుందని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ ఆరోపించారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మత రాజకీయం కోసం ఎంపీ బాబురావు లంబాడీలను ఎస్టీ నుంచి తొలగించాలనే వ్యాఖ్యలను గిరిజన సంఘం ఖండిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని, ఇకపైన ఓట్లరాజకీయం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు శ్రీను నాయక్, శంకర్ నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రజలను చైతన్యం చేయాలి

నవతెలంగాణ-పిట్లం

పారిశుధ్య నిర్వహణపై ప్రజలు సహకరించేలా చైతన్య పరచాలని సర్పంచ్ విజయ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, నీటి సరఫరా, విద్యుత్తు కారోబార్లు సమ్మెలో ఉన్నందున పలు వార్డులలోని ప్రజలు ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా చెత్త కుండీలలో వేసేలా ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఆమె సూచించారు. తాగునీటి, విద్యుత్తు సమస్యలు ఏమైనా తలెత్తినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీం జునోది, పంచాయతీ సెక్రెటరీ యాదగిరి, ఆయా వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో కంటి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించినట్టు మండల వైద్యాధికారి హేమ బిందు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వాతావరణంలో మార్పుల వలన విద్యార్థులకు చిన్న పిల్లలకు కండ్లకలక వస్తుండటంతో ముందస్తు జాగ్రత్తగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో 12 మంది కండ్లకలక ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు. వారికి కంటి మందులు పంపిణీ చేసి హెూమ్ ఐసోలేషన్‌కు పంపారు. మిగతా పిల్లలకు 28 కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సూపర్‌వైజర్ రమేష్, యాదగిరి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశాకార్యకర్తలు చంద్రకళ, రేణుక, సావిత్రి, స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, సిస్టర్ శృతి పాల్గొన్నారు.

పాఠశాలలో నీటి వసతి కల్పించాలి

- విద్యార్థులు నిరసన


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పర్మల్ల ప్రాథమిక పాఠశాలలో నీటి వసతి కల్పించాలని కోరుతూ విద్యార్థులు తమ ప్లేట్లు పట్టుకుని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ప్లేట్లు కడగడానికి నీళ్ల లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. తిన్న తర్వాత ప్లేట్లను కడుక్కోవడానికి రోడ్డు పక్కనున్న కుళాయి దగ్గరికి వెళ్లి శుభ్రరుచుకోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటిని అందించడానికి ఎంపీటీసీ నిధులతో బోరు వేసినా.. ఇప్పటివరకు మోటారు బిగించలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తాగునీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె

- కొనసాగుతున్న 26వ రోజుకు నిరవధిక సమ్మె

నవతెలంగాణ-విలేకరుల బృందం

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలు మండల కేంద్రాల్లో కార్మికులు వివిధ రూపాల్లో నిరసన తెలిపారు.

తాడ్వాయి : మండల కేంద్రంలో సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి తాము కోరే న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.


రెంజల్‌లో సమ్మెలో పాల్గొన్న నాయకులు

రెంజల్ : మండల కేంద్రంలో సమ్మె కొనసాగుతోంది. తమ డిమాండ్లు తీర్చే వరకు సమ్మెను నిలిపే ప్రసక్తే లేదని వారు హెచ్చరించారు. పస్తులుండైనా, సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు పసివుద్దీన్, ప్రధాన కార్యదర్శి బి, సాయిలు, మాజీ మండల అధ్యక్షులు మక్కన్న లాలు, పోతన్న, యాదగిరి, సాయన్న, గంగామణి, లక్ష్మణ్, సతీష్, చిన్నసాయిలు, శంకర్, నక్క అనిత, భూలక్ష్మి, గని పల్లయ్య పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయ ముట్టడికి తరలిన కార్మికులు..

బోధన్ : తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత 26 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడిని పిలుపునిచ్చారు. ఈ పిలుపులో భాగంగా బోధన్ మండలం నుంచి పంచాయతీ కార్మికులు వాహనాలలో తరలివెళ్లారు. సీఐటీయూ జిల్లా నాయకులు శంకర్ గౌడ్, మండల అధ్యక్షులు రేఖ, కార్యదర్శి సాగర్ కార్మికులున్నారు.

పారహక్కుల పట్ల అవగాహన

నవతెలంగాణ-కోటగిరి

పోతం గల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు సోమవారం అవగాహన కల్పించారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అందరూ ఐకమత్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఏఎస్ఐ బాలొసింగ్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ నరహరి, ఆర్ఐ సాయిలు, స్థానిక నాయకులు రాంబాబు, విటల్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆగస్టు 4న కార్మిక గర్జన సభ

- పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

ఆగస్టు 4న హైదరాబాదులో జరిగే కార్మిక గర్జన మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని నీలా గ్రామంలో బీడీ కార్మికులతో గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతిని కల్పించాలని, బీడీ కార్మికులు పనిచేసే రాజీనామా చేసిన తర్వాత తక్కువ పింఛను వస్తున్నందున వారికి పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి పది సంవత్సరాలు కావస్తున్న కార్మికులకు గెజిట్ రాజపత్రం ఇప్పటివరకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. జిల్లా అధిష్టాన వర్గం పిలుపుమేరకు ఆగస్టు 4న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్కె నసీర్, కార్మికులు లక్ష్మి సుక్కుల సంగీత, రిహానా, మాధవి, గంగామని తదితరులు పాల్గొన్నారు.

రైతు దీక్షకు కాంగ్రెస్, బీజేపీ నాయకుల సంఘీభావం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం 34వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు దీక్ష శిబిరంలో కూర్చుని సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు కటికల శ్రీనివాస్, ఈర్ల రాజు, బొడిగి రవి, గైని ఆనంద్, తిరుపతి, బుజ్జి, ఎల్.కృష్ణ, సుధాకర్, గోపికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే
నిరుపేదలందరికీ ఇండ్లు కట్టిస్తాం

- వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్(లింగంపేట్)

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని, వారి స్వంత స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారికి రూ.5లక్షల రూపాయలు అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలపై కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన దీక్ష, వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం గత 2017 సంవత్సరంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి హయాంలో శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పటివరకు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం పూర్తికాలేక అసంపూర్తిగా ఉన్నాయన్నారు. అలాగే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ హయంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు తప్ప ఎక్కడ కూడా డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తి కాలేదన్నారు. ఎల్లారెడ్డిలో కొన్ని డబుల్ బెడ్ రూం ఇళ్ళు కట్టి వాటిని లాటరీ ద్వారా కొంతమందికి మాత్రమే ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇల్లు లేని నిరుపేదలందరికీ వారి స్థలాల్లోనే ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతుల ధాన్యం క్వింటాల్‌కు రూ.2,500 కొనుగోలు చేస్తూ, రెండు లక్షల ఉద్యోగాలు ప్రవేశపెట్టి, ధరణి కార్యక్రమాన్ని రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాగిరెడ్డిపేట్ మండల అధ్యక్షుడు ధనుంజయ్, యూత్ మండల ప్రెసిడెంట్ జమాల్పూర్ రాకేష్, మైనారిటీ ప్రెసిడెంట్ షాహిద్ ఆఫ్రిద్, సీనియర్ నాయకుడు దుర్గేష్, షరీఫ్ ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

పోషణ అభియాన్‌పై అవగాహన

నవతెలంగాణ-రెంజల్

పోషణ అభియాన్‌లో భాగంగా అంగన్వాడీ టీచర్లకు జిల్లా కోఆర్డినేటర్ నరేష్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణీ బాలింత మహిళలతో పాటు చిన్నారులకు పౌష్టిక ఆహారాన్ని ఏ విధంగా అందజేయాలనే దానిపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఎత్తు, బరువులను కొలిసి వారికి పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ టీచర్లు గర్భిణులకు పోషకాహారం గురించి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకున్నట్లయితే పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఖచ్చితంగా తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల మాట్లాడుతూ నూతనంగా వచ్చిన అంగన్వాడీ టీచర్లకు ఆన్లైన్ నమోదు కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన గోసంగి సంఘం ఎన్నిక


ఎన్నికైన గోసంగి సంఘం నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండల కేంద్రంలో గోసంగి సంఘాన్ని మండల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షునిగా దుర్గయ్య, ఉపాధ్యక్షుడిగా సిద్దయ్య, కార్యదర్శి పాపయ్య, కోశాధికారి మల్లేశం, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్నికైన దుర్గయ్య మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలకు నోటీసులు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలో అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేపడితే శాఖా పరమైన చర్యలు తీసుకోనున్నట్టు భిక్కనూర్ పంచాయతీ కార్యదర్శి సదాశివ్ తెలిపారు. బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని ధర్నా చేసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ రోడ్డుని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి ఇప్పటికే మూడు నోటీసులు అందజేశామని, అలాగే ఇంటి నిర్మాణాలు చేపడితే ఉన్నత అధికారులకు నివేదిక సమర్పించి అధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రామారెడ్డి ఎస్ఐగా సుధాకర్

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి ఎస్ఐగా సుధాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన అనిల్ బదిలీపై కామారెడ్డి వెళ్లగా, ఆయన స్థానంలో దోమకొండలో పనిచేసిన సుధాకర్‌కు రామారెడ్డి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతి విద్యార్థి భోజనం చేసే సమయంలో చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని మెడికల్ అధికారి యేమిమా తెలిపారు. సోమవారం మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు మందులు పంపిణీ చేసి తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, హెల్త్ సూపర్వైజర్ బసవయ్య, దీవెన, ఏఎన్ఎం యాదమ్మ, ఆశా వర్కర్ నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు సన్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఆర్డీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బూరుగు రాజాగౌడ్‌ను మంధర్న గ్రామస్తులు సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో ఉన్న భూ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని వారు ఆర్డీఓకు విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆర్డీవోను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- రిజిస్ట్రార్‌కు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సోమవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎల్బీ రవి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ బికోజి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ వ్యవస్థలు అనే పదాలు లేకుండా చేస్తానని, అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తానని చెప్పిన వాటిని అమలుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రిజిస్ట్రార్‌తో డిమాండ్లతో కూడిన వాల్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. యూనివర్సిటీ ప్రారంభం నుండి 15 సంవత్సరాలకు పైగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. కొందరు పదవీ విరమణ వయస్సుకు దగ్గరలో ఉన్నారని, ఇంకొంత మందికి వయస్సు మీద పడుతుంది అయినా ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని అన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి కోసం యూనివర్సిటీలో ఎన్నో కొత్త కోర్సులు వచ్చిన వాటి అభివృద్ధి కోసం నిరంతరం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే కీలకంగా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కనీస భద్రత లేదని చాలీచాలని జీతాలతో వెళ్లదీస్తున్నారన్నారు. ఉద్యోగం చేస్తూ చనిపోయిన వారి కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, చనిపోయిన ఉద్యోగి కుటుంబానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం సుప్రీం కోర్టు తీర్పు ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు రవి, సురేష్ బికోజీ, నరేష్, డా. రవీందర్, రమేష్, శ్రీధర్, గణేష్, దిగంబర్, మమత, శోభరాణి, మౌనిక, వాకుల, పద్మ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పౌష్టికాహారం అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి సోమవారం పౌష్టికారాన్ని అందజేశారు. ప్రతిరోజు చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట అంగన్వాడీ టీచర్ అరుణ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎంపీటీసీ రిలే నిరాహారదీక్ష

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ తల్లి ప్రాంగణంలో అన్నసాగర్ ఎంపీటీసీ ఉమా దేవి గురుప్రతాప్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం 5వ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ తమ డిమాండ్లను నెరవేర్చే వరకు రిలే నిరాహారదీక్ష కొసాగిస్తామని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఎంపీటీసీ దీక్షకు మద్దతుగా అన్నసాగర్ గ్రామస్తులు దీక్షలో పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి



మాట్లాడుతున్న వైద్యాధికారి

నవతెలంగాణ-ఎడపల్లి

విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి ఉంటుందని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శుభశ్రీ అన్నారు. మండలంలోని పోచారం గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు ఆరోగ్యం పట్ల అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శుభశ్రీ మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు తమ ఇంట్లో తల్లిదండ్రులకు తెలియపరచాలన్నారు. వైద్యాధికారి రాజ్ కుమార్, ఉపాధ్యాయులు హనుమాన్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, ఆశావర్కర్ కాంతా, ఉపాధ్యాయులు బాల బాలికలు పాల్గొన్నారు.

పరిశుభ్రత, పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-పిట్లం

పరి శుభ్రత, పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ప్రధానోపాధ్యాయుడు అశోక్, సెక్రటరీ తుకారం తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కంబాపూర్ ప్రాథమిక పాఠశాలలో పరిశుభ్రత, పరిరక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల వారం రోజులపాటు భారీ వర్షాలు కురియడంతో పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని, కాగా వర్షాలు తగ్గుముఖం పట్టినందున పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో పాఠశాల ఆవరణలో గడ్డి మందు పిచికారీ చేసి బ్లీచింగ్ పౌడర్‌తో నిర్వహణ పనులు నిర్వహించిన అనంతరం వర్షాకాలంలో విద్యార్థుల తీసుకోవలసిన జాగ్రత్తలను నిర్దేశించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, గ్రామపంచాయతీ సిబ్బంది ఇప్ప సాయిలు, గడ్డం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న విస్తీర్ణ అధికారి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గాం శివారులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంటలను వ్యవసాయ విస్తీర్ణ అధికారి అజయ్ సోమవారం పరిశీలించారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు పంటలు నీటిలోనే మురిగిపోతున్నాయని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. చెరువులోని ఎగువ భాగం బ్యాక్ వాటర్ నిలిచిపోవడంతో తమ పంటకు నష్టం వాటిల్లిందని వివరించారు. చెరువులో నీటిని తొలగించడానికి గ్రామస్తులు వ్యతిరేకిస్తుండడంతో రైతులు అధికారుల చుట్టూ తిరిగిన లాభం లేకపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అధికారులను సైతం బెదిరిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. నీట మునిగిన పంటల వివరాలను సేకరించి మండల వ్యవసాయ అధికారికి నివేదికను అందించనున్నట్లు విస్తీర్ణ అధికారి అజయ్ పేర్కొన్నారు.

రాగి జావా అందజేత


రాగిజావ ప్యాకెట్లను అందజేస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రాగి జావా ప్యాకెట్లను విద్యా వనరుల కేంద్రంలో విద్యాశాఖ అధికారి దేవిసింగ్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషకాహారంలో భాగంగా విద్యార్థులకు ఇమ్యూనిటీ పెరగాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఒక పూటకు గానూ 10 గ్రాముల రాగి జావా 10 గ్రాముల బెల్లముతో కూడిన జావాను మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారు పాఠశాల విరామ సమయంలో అందిస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులలో మేథో శక్తి, శారీరక ధారుడ్యం పెంపొందుటకు అవకాశముందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రమోద్ పటేల్, సీఆర్పీ హైమద్ పాష, సిబ్బంది అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

- జూనియర్ కళాశాల ఎదుట ధర్నా

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండలో డిగ్రీ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండల విద్యార్థులు, యువకులు మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దోమకొండ గ్రామానికి చెందిన విక్రమ్, వహీద్ మాట్లాడుతూ.. గత 6, 7 సంవత్సరాల నుంచి దోమకొండ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలంటూ ఆందోళనలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం కూడా స్పందించలేకపోవడం చాలా బాధాకరమన్నారు. దోమకొండలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలంటూ 2017 సంవత్సరంలో 100 రోజులు అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేసినప్పటికీ కూడా ప్రభుత్వం ఏమాత్రం చొరవ చూపలేదంటూ అదే రిలే నిరాహార దీక్ష చేపట్టిన తరుణంలో అఖిలపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారని అన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేంతవరకు దోమకొండ యువతే కాకుండా విద్యార్థి సంఘాలు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న యువకులు

ప్రకృతి విలయతాండవం చేస్తే మంత్రిపై నీచ రాజకీయాలా

- బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ప్రకృతి విలయతాండవం చేస్తే మంత్రిపై నీచ రాజకీయాలు చేస్తారా.. అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం మాట్లాడుతూ... ప్రకృతి విలయతాండవం చేసి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల రాష్ట్ర ప్రజలే గాక, బాల్కొండ నియోజకవర్గ రైతులు పంటలు నష్టపోయారని అన్నారు. వానలు సైతం లెక్కచేయకుండా మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రజల మధ్య తిరుగుతూ...వారి బాధలు తెలుసుకున్నాడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి వర్షాలు పడ్డప్పుడు ఇంట్లో పడుకుని, వర్షాలు ఆగిపోయిన తర్వాత ఆదివారం దోంచంద గ్రామానికి వచ్చి రైతులపై కపట ప్రేమను నటిస్తూ...నీచ రాజకీయాలు చేశాడని పూర్ణానందం అన్నారు. పంటనష్టం ఇవ్వకపోతే మంత్రి ప్రశాంత్ రెడ్డి ఇల్లును ముట్టడిస్తామని మానాల మోహన్ రెడ్డి అనడం సిగ్గుచేటని, అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం అన్నారు. జోరు వర్షాల్లో మంత్రి ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో తిరిగింది అందరికి కనిపించిందని అన్నారు. పంటనష్టం గురించి అంచనా వేయవలసిందిగా అధికారులను సైతం ఆదేశించారని, అధికారులు అదేపనిలో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రకృతి వైపరీత్యాలు జరిగితే వారి నాయకుల ఇంటిని ఎవరైనా ముట్టడించారా అని అడుగుతున్నా మన్నారు. సమావేశంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్,ఎంపీటీసీ జక్కని మధుసూదన్, తాళ్ల రాంపూర్ సర్పంచ్ భాను ప్రసాద్,పీఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షుడు సున్నపు అంజయ్య నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్,ఆకుల రాజేందర్, కూతురు సాయన్న, గన్నారపు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కార్పొరేట్ శక్తుల నుంచి మణిపూర్‌ను రక్షించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల నుండి మణిపూర్‌ను రక్షించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, నగర ఉపాధ్యక్షురాలు దేవిక అన్నారు. మణిపూర్‌లో అమ్మాయిలను అత్యాచారం చేసి అర్ధనగ్నంగా ఊరేగింపడాన్ని, హింసాత్మక ఘటనలను ఖండిస్తూ పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో కోటగల్లీ లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో అమ్మాయిలను అత్యాచారం చేసి ఊరేగింపడం దుర్మార్గమైన చర్య అని, గత మూడు నెలలుగా హింసాత్మక ఘటనలు జరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దానిని అరికట్టే ప్రయత్నాలు చేయటం లేదని అన్నారు. మణిపూర్ లోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగించడాని గిరిజన ఆదివాసీ తెగలకు సంబంధించిన చట్టాలను సవరించే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దేశంలో నిత్యం అమ్మాయిలపై దాడులు అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, హింసాత్మక ఘటనలు జరుగుతున్న దేశ ప్రదాని మాట్లాడకపోవటం సిగ్గు చేటని , వెంటనే రాష్ట్రపతి కలుగజేయుకొని మణిపూర్ లో శాంతియుత వాతావరణన్నీ నెలకొల్పాలని, స్థానిక ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని, ప్రాణనష్టం ఆస్తి నష్టం జరిగినటువంటి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు మనోజ్.నిఖిల్,వంశీ, శ్రీజ,తనుజ మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే సమ్మెలోకి వెళ్తాం

- మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే సమ్మెలోకి వెళ్తామని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ అన్నారు. యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, బిల్లులు రాక అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని అన్నారు. బిల్లులు చెల్లిస్తామని చెప్పినప్పటికీ దానికి సరిపడా బడ్జెట్ విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. ఫిబ్రవరి నెల నుండి 3000 రూపాయల వేతనాన్ని పెండింగ్ ఏరియర్స్‌తోసహా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే తిరిగి సమ్మెలోకి వెళ్తామని దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షురాలు స్వప్న, నాయకులు రాజా గౌడ్, సంధ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మల్యాల గోవర్ధన్

పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తా

- ఏఐసీసీ సెక్రటరీ పిసి.విష్ణునాథ్‌తో భేటీలో సంజయ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ఏఐసీసీ సెక్రటరీ పిసి. విష్ణునాథ్‌తో సోమవారం ధర్మపురి సంజయ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకలాపాలు, ఎన్ని కల వ్యూహాలపై చర్చించారు. కాం గ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంపై దృష్టి సారించి పని చేయాలని సూచించిన పీ.సి విష్ణునాథ్, పార్టీ ప్రజల అభ్యున్నతి కోసం తమ వంతు కృషి చేస్తామని, అవిశ్రాంతంగా పని చేస్తామని, పార్టీని బలోపేతం చేయడానికి బలమైన సంకల్పంతో ముందుకెళ్తామని ధర్మపురి సంజయ్ వివరించారు.


విష్ణునాథ్‌తో బేటీ అయిన సంజయ్

అర్హత ఉన్న వారికే ఇండ్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు పెద్దివెంకట్రాములు

నవతెలంగాణ-భీంగల్

అర్హులైన వారికే ఇండ్లు ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు పె ద్ది వెంకట్రాములు అన్నా రు. సోమ వారం భీంగల్ పట్టణకేంద్రంలో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంతో మంది నిరుపేదలు రెక్కాడితేగానీ డొక్కాడని వారు ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున అలాంటి వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు , కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిసిఎం నాయకులు, మహిళలు ఉన్నారు.


మాట్లాడుతున్న పెద్ది వెంకట్రాములు

కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తా

- మేయర్ నీతూకిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగర లోని వినాయక నగర్ వైష్ణవి రెసిడెన్సి పరిసర ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని నగర మేయర్ నీతూ కిరణ్ చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. సోమవారం వినాయక నగర్ వైష్ణవి రెసిడెన్సిప్రాంతంలోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగు నీటి సమస్యలపై తనిఖీ చేశారు. విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి వైష్ణవి రెసిడెన్సి వాసులు, కాలనీ వాసులతో వారు మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని, మురికి నీరని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ద్వారా పంపేందుకు కనెక్షన్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాత్రి వేళలో ఇబ్బందులకు గురవుతున్న దృష్ట్యా వీధి దీపాలను వెంటనే ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ నీటి ట్యాంకు ద్వారా వైష్ణవి రెసిడెన్సికి మంచినీరు కనెక్షన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మేయర్‌ను కలిసిన వారిలో వైష్ణవి రెసిడెన్సి కమిటీ అధ్యక్షురాలు నిర్మల హృదయ, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, కోశాధికారి సురేష్, సలహాదారులు కే.రామ్మోహన్రావు, కమిటీ నాయకులు ప్రభాకర్, పద్మ, జాన్సన్, మధుసూదన్, ప్రవీణ్, పార్థసారథి, తదితరులు ఉన్నారు.

జీఓ 151ని అమలు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జీఓ 151అమలు చేయాలని కోరుతూ నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య మాట్లాడుతూ.. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వారి విద్యా అర్హతలను బట్టి వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం 2021లో జీవో 151 విడుదల చేసిన నేటికీ అమలు చేయడంలేదనాన్న. ఉన్నత విద్య కలిగిన చాలా మంది ఉద్యోగులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన జీఓ నెంబర్ 151ప్రకారం పదోన్నతులు కల్పించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజు, గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 106 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భిక్కనూర్ ఎస్సైగా సాయికుమార్


బదిలీపై వెళ్తున్న ఎస్ఐలకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ ఎస్సైగా సాయికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు విధులు నిర్వహించిన ఎస్సై ఆనంద్ గౌడ్ మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్ మండలానికి బదిలీపై వెళ్లగా బీబీపేట్ మండలంలో ఎస్సైగా పనిచేసిన సాయికుమార్ భిక్కనూర్ మండలానికి బదిలీపై వచ్చారు.

బదిలీపై వెళ్తున్న ఎస్ఐలకు సన్మానం..

సర్కిల్ కార్యాలయ పరిధిలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎస్సైలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. రాజంపేట్, భిక్కనూర్, బీబీపేట్ ఎస్ఐలను ఘనంగా సన్మానించారు.

మంచిప్ప గ్రామంలో కేంద్ర బృందం పర్యటన



నవతెలంగాణ-మోపాల్

స్వచ్ భారత్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ ఫయాజ్ మంచిప్ప గ్రామంలో సోమవారం పర్యటించారు. గ్రామంలో మొత్తం ఇంకుడు గుంతలు కానీ, అలాగే ఉపాధి హామీలో జరిగిన పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలోని కొందరు ఇంకుడు గుంతలు తవ్విన వారికి ఇప్పటివరకు డబ్బులు రాలేదని మేనేజర్ ముందు వాపోయారు. కచ్చితంగా అతి త్వరలో డబ్బులు వచ్చే విధంగా చూస్తానని, మండల అధికారులతో మాట్లాడతానని ఆయన తెలిపారు. ఇప్పటివరకు పర్యటించిన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం మెరుగ్గా ఉన్న గ్రామాల్లో మంచిప్ప గ్రామం ఒకటి అని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచ్ ఇందురు సిద్ధార్థని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగదీష్, ఎంపిడిఓ లింగం నాయక్, ఎంపిఓ, ఇక్బాల్, ఏ పి ఎం మోహన్ తదితరులు పాల్గొన్నారు

ఎక్కడి సమస్యలు అక్కడే

- సుందరయ్య కాలనీ సమస్యలు పట్టని పాలకులు, అధికారులు
- విలీన గ్రామాల్లో తీరని సమస్యలు

నవతెలంగాణ-ఆర్మూర్

నిరుపేదలు అద్దె ఇంట్లో ఉంటూ కిరాయి కట్టే స్తోమత లేని వారు 2018 మార్చి 27న పట్టణంలోని లెదర్ పార్క్ సమీపంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో పేదల పక్షాన పోరాడుతున్న సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. ఆ కాలనీకి సుందరయ్య కాలనీగా నామకరణం చేసి జీవిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక ఆందోళన చెందుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకునే వారు కరువయ్యారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ గుడిసెల స్థానంలో పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కుటుంబ పోషణ భారంగా

నిరుపేద కుటుంబాలు కావడం దినసరి కూలీ పనులు చేసుకునే వాళ్లు కావడంతో పూట గడవటమే కష్టం. అలాంటి పరిస్థితుల్లో ఇండ్లకు అద్దె చెల్లించడం తలకు మించిన భారంగా మారింది. దీంతో ప్రభుత్వ భూమిలో గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణంలో అద్దె ఇల్లు దొరకడమే కష్టంగా మారింది. పెద్ద దిక్కు లేని వారికి ఇల్లు అద్దెకు ఇచ్చేందుకు యజమానులు సంకోచిస్తున్నారు. సుందరయ్య కాలనీలో నిరుపేదలు అందరూ దాదాపు బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు (ఫైల్)


సుందర్య్య కాలనీ రోడ్డు

డబుల్ బెడ్ రూమ్ లు కట్టించాలి

మున్సిపల్ పరిధిలోని సుమారుగా 5 వేలకు పైగా నిరుపేదలు తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని గతంలో దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికి 5 సంవత్సరాలు గడుస్తున్నా వారికి ఎదురుచూపులే మిగిలాయి తప్పా ఇంటి నిర్మాణానికి ఒక్క అడుగు సైతం ముందుకు పడలేదు. దీంతో విసిగి వేసారిపోయిన నిరుపేదలు యానం కొట్టం లేదా పార్క్ సమీపంలోని 401..66 సర్వేనెంబర్ లోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. ఇక్కడే లెదర్ పార్క్ ఫ్యాక్టరీ కోసం 28 ఎకరాల స్థలం కేటాయించారు.

అది పోను మిగిలిన భూమిలో తమకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిరుపేదలు డిమాండ్ చేస్తూ ఉద్యమం కొనసాగిస్తున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య లు పేదల పక్షాన ఉంటూ ఇప్పటికీ నిర్విరామ పోరాటం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

మహమ్మద్ ఖలీం-సుందరయ్య కాలనీ వాసి

కాలనీలో నీరు కరెంటు సౌకర్యాలు లేవు. ఇక్కడకు వచ్చేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. మాకు దిక్కు లేని పరిస్థితిలో ఇక్కడ నివసిస్తున్నాం. విష పురుగుల సంచారం ఎక్కువగా ఉంది. దీంతో పిల్లలతో అష్టకష్టాలు పడుతున్నాం. మా సమస్యలను ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించిన స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు సౌకర్యాలు కల్పించాలి. 200 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. మేము నివసించే దగ్గర మొరం తవ్వకాలు తవ్వి చెరువు లాగా తయారయింది. రెవెన్యూ మున్సిపల్ అధికారులు సంబంధిత నాయకులు మహా సమస్యలు పరిష్కరించాలి

టెండర్ల ప్రక్రియ చేపడతాం

పండిత్ వినీత పవన్ ,మున్సిపల్ చైర్ పర్సన్, ఆర్మూర్ పట్టణంతో పాటు విలీనమైన గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తాం. పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు అయినాయి. అతి త్వరలోనే టెండర్ల ప్రక్రియ చేపడతాం.

ఓపెన్ జిమ్ పనులు ప్రారంభం


జిమ్ పనులు ప్రారంభిస్తున్న బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాలుగవ డివిజన్ బ్యాంకు కాలనీలో సోమవారం ఓపెన్ జిమ్ పనులను ధర్పల్లి జడ్పీటీసీ, జిల్లా ఒలంపిక్ కమిటీ ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో పని ఒత్తిడితో ఆందోళనకు గురవుతున్న ప్రజలకు వ్యాయామం ద్వారా ప్రశాంతత లభిస్తుందన్నారు. కాలనీ యువత ఈ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవలన్నారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ బాజిరెడ్డి జగన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాలుగవ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాగళ్ళ శ్రీకాంత్ చౌదరీ, పార్టీ బీసీ విభాగపు అధ్యక్షులు మల్లెపూల నరసింహ చారీ మాట్లాడుతూ గ్రామీణ శాసనసభ్యులు, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ డివిజన్లోని బ్యాంకు కాలనీపైన ప్రత్యేక శ్రద్ధ చూపి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెనిగళ్ల సురేష్, కోశాధికారి రమేష్ కులకర్ణి, మహిళ మండలి అధ్యక్షురాలు ముత్యాల శిల్ప, యువజన నాయకుడు అభిలాష్, సీనియర్ నాయకులు సాయన్న, వినోద్, మధుగౌడ్,కాలనీ సభ్యులు ఖాదర్ బాషా, అయ్యప్ప శ్రీను, ఐకేపి శ్రీనివాస్, శోభ దేవి, జ్యోష్న, నారాయణ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

దొంగల హల్చల్

నవతెలంగాణ ఆర్మూర్

పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని ఆదివారం రాత్రి దోపిడి దొంగలు హల్చల్ చేశారు. . రెండు షట్టర్ల తాళాలు పగలగొట్టి పైకి లేపి సెల్ ఫోన్లను ఎత్తుకెళ్లినట్టు తెలిసింది.

బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రానికి చెందిన సత్యవ్వ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ షకీల్ అమీర్ సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షల 50వేల (ఎల్ఓసీ) కాపీని బాధిత కుటుంబానికి మంజూరు చేయించారు.

కళ్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీచేశారు. నూనె నిఖితకు 1,00,116, చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ నచ్చు చిన్నారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పెంట భోజరెడ్డి, 4వ వార్డు అధ్యక్షులు కామని నరేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సొన్న నర్సింలు,

రైతు విభాగం అధ్యక్షులు పెద్దకాపు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పంజా విసురుతున్న సైబర్ నేరాలు

- నిత్యం ఎవరో ఒకరు సైబర్ బారిన పడుతున్నారు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

'హలో.. మేము బ్యాంకు నుండి కాల్ చేస్తున్నాం. మీ ఏటీఎం కార్డు అప్‌డేట్ చేస్తున్నాం.. ఓటిపి చెప్పండి.' 'మీ అకౌంట్ బ్లాక్ అవుతుంది. కాకుండా ఉండాలంటే మీ ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి అప్‌డేట్ చేసుకోండి.' 'మీ ఏటీఎం బ్లాక్ అవుతుంది. కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలి. మీ వివరాలు చెప్పండి'. హలో మీరు లక్కీ డ్రా లో లక్ష రూపాయలు వచ్చాయి అని ఫోన్ వచ్చిందా అయితే అవి పూర్తిగా మోసపూరిత ఫోన్‌లు మాత్రమే. వీటితో పాటు మీ కరెంట్ బిల్ కట్టకపోతే మీ కరెంట్ కట్ అవుతుంది అని ఫోన్ వచ్చిందా , మీ ఆధార్ కి ఫోన్ నెంబర్ లింక్ చేసుకోండి లేదా మీ అకౌంట్ బ్లాక్ అవుతుంది అని మీరు ఈకేవైసి చేసుకోండి అని ఫోన్ వచ్చిందా, తెలియక ఏదైనా సమస్య వచ్చి గూగుల్ లో కస్టమర్ కేర్ నెంబర్ వేతికరా మీరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కున్నట్లే. సైబర్ నేరగాళ్లు ఈజీగా ప్రజలను బోల్తా కొట్టిస్తూ అక్రమంగా కోట్లలో డబ్బులు సంపాదిస్తున్నారు. ఇలా రోజు ఎక్కడో ఒక చోట సైబర్ నేరాలు జరుగుతూనే ఉన్నాయి. సైబర్ నేరగాళ్ళు వాట్సాప్‌లో లింక్ పంపి ఓపెన్ చేయండి అని లేదా మెసేజ్ ద్వారా లింక్ బాధితుడుకి పంపించి ఓటిపి చెప్పండి అని సైబర్ నేరగాళ్లు ఈజీ గా డబ్బులు సంపాదిస్తున్నారు. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటి వల్ల కూడా సైబర్ నేరాలు జరుగుతున్నాయి. కొంతమంది తెలిసి మరి కొంతమంది తెలియక ఈ ఉచ్చులో చిక్కుకొని డబ్బులు పోగొట్టుకుంటున్నారు. పోలీసులు ఎంత అవగాహన కల్పించిన సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి


సామాన్య జనం డబ్బులు పొగుట్టుకుంటున్నారు.

అపరిచితులకు ఎలాంటి ఇన్ఫర్మేషన్ ఇవ్వద్దు

అపరిచితులు కాల్ చేసి మీకు డబ్బులు వచ్చాయి అని మరి ఏదైనా ఆఫర్ ఉంది అని మీ బ్యాంకు డీటెయిల్స్ ఇచ్చారా మీ డబ్బులు మాయం అవుతాయి. అపరిచితులు ఫోన్ చేసి ఏ ఇన్ఫర్మేషన్ అడిగినా ఎలాంటి పరిస్థితుల్లో ఇవ్వద్దు. డబ్బులు పోయిన వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి వివరాలు తెలపాలని పోలీసులు సూచిస్తున్నారు. 1930 నెంబర్ కాల్ చేయటం ద్వారా నేరగాళ్ళ అకౌంట్‌ను వెంటనే బ్లాక్ చేసి తిరిగి డబ్బులు వచ్చే టట్టు చేస్తారు.

నిత్యం అవగాహన కల్పిస్తున్నాం

ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌లు



ఎవరైనా బ్యాంకు నుండి కాల్ చేస్తున్నాం అని కస్టమర్ కేర్ నుండి కాల్ చేస్తున్నాం అని చెప్పి ఓటిపి అడిగినా పిన్ అడిగినా ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వద్దు అని తెలిపారు. నిత్యం సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. మోసపోతే వెంటనే 1930 నెంబర్ కాల్ చేయాలి.

పలు అంశాలపై తీర్మానం


ఆర్డీవోను సన్మానిస్తున్న మున్సిపల్ పాలకవర్గం

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మశరత్‌రెడ్డి ఆధ్వర్యంలో సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ పెరక సంగీత మృతి పట్ల కౌన్సిల్ సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. అనంతరం 15 అంశాలపై ఎజెండాలకు తీర్మానం ఆమోదించారు. ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రాజా గౌడ్‌ను సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తాడ్‌బిలోలిని సందర్శించిన కేంద్ర బృందం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి గ్రామాన్ని కేంద్ర --బృందం సోమవారం సందర్శించింది. గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన డంపింగ్ యార్డ్, ఉపాధి హామీ పనులు, మరుగుదొడ్లు, కంపోస్ట్ ఎరువుల తయారీని కేంద్ర --బృందం కోఆర్డినేటర్ వెంకటేష్ పరిశీలించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల విషయంలో సర్పంచి కొన్ని సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీ ఓ గౌస్ ఉద్దీన్, సర్పంచ్ సునీత నరసయ్య ఏపిఎం చిన్నయ్య, ఈసీ శరత్చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జంపాకు ఘన నివాళ్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జన విజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణ కిషోర్ సోమవారం మృతిచెందారు. ఆయన మృతికి సంతాపంగా జన విజ్ఞాన వేదిక నిజామాబాదు శాఖ నివాళులు అర్పించారు. మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. వారు 1988 నుండి జన విజ్ఞాన వేదిక కార్యకర్త స్థాయి నుండి జాతీయస్థాయి నాయకుడి వరకు ఎదిగారని అన్నారు. నిస్వార్థంగా పనిచేశాడని జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ పి.రామ్ మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు నర్రా రామారావు, వీ.వీ ప్రసాద్ రావు, కోయడి నరసింహులు, వెంకట మల్లయ్య, డాక్టర్ సూరి, తదితరులు పాల్గొన్నారు.


నివాళ్లు అర్పిస్తున్న జేవీవీ నాయకులు